క్లుప్తంగా

టీకాలు వేయించాలి

తోట్లవల్లూరు: పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా టీకాలు వేయించాలని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. మిషన్ ఇంద్రధనుస్సు 5.0లో భాగంగా ఆరోగ్య సిబ్బంది సోమవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులను గుర్తించి వ్యాక్సిన్ వేస్తున్నట్లు డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. ఈ నెల 12 వరకు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓలు మాణిక్యం, శ్రీధర్, ఎంపీహెచ్‌ఎస్ అనిల్, ఆరోగ్య సిబ్బంది పద్మావతి, రోహిణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేకు ఎంపిక

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఏఐసీటీఈ, ఎంహెచ్‌ఆర్‌డీ ప్రారంభించిన ఉన్నత్ భారత్ అభియాన్ సర్వే నిర్వహించేందుకు ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు ఐదు గ్రామాల్లో సర్వే నిర్వహించి వివరాలను ఎంహెచ్‌ఆర్‌డీకు పంపుతారన్నారు. సర్వే కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు లాంఛనంగా ప్రారంభించి విద్యార్థులకు సూచనలు సలహాలు అందజేశారు. తమ విద్యార్థులు పాలుపంచుకుని భారత ప్రభుత్వ ప్రణాళిక తయారు చేయడంలో భాగస్వాములు కావడం అభినందనీయం అన్నారు. ఈ సర్వేలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, గౌరవ సలహాదారు ఎస్.శంకర్, అధ్యాపకులు, బీఎస్‌ఎస్ పద్మజ పాల్గొన్నారు.

స్పందనలో బాధితుల వినతి

గుడివాడ టౌన్: ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. బాపులపాడు మండలం కోడూరుపాడుకు చెందిన కొలుసు వెంకటేశ్వరరావు తన భూమి ఆక్రమణకు గురైందని సమస్యను పరిష్కరించవలసిందిగా కోరారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణానికి చెందిన ఎన్వీ తులసిబాబు తనకు టిడ్కో ఇల్లు కేటాయించిన పట్టాలో పేర్కొన్న సమాచారం, బ్యాంకుకు పంపిన సమాచారంలో తేడాలు ఉన్నాయని, వాటిని సరిచేయాలని స్పందనలో దరఖాస్తు చేశారు. వీటితో పాటు రైల్వే స్టేషన్ సమీపంలో అక్రమంగా అనుమతులు లేకుండా నిర్మించిన భవనం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మరొక దరఖాస్తు వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

36 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

కైకలూరు: రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిబంధనలు అనుసరించి కై కలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీజెడ్‌సీ, ఏజెడ్‌సీ కోర్సులు ద్వితీయ సంవత్సరం చదువుతున్న 36 మంది విద్యార్థులకు స్థానిక మత్స్యశాఖలో రెండు నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కు అనుమతులు వచ్చాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి సోమవారం చెప్పారు. ఈ మేరకు విద్యార్థులతో కలసి మత్స్యశాఖ కార్యాలయంలో ఆ శాఖ సహాయ సంచాలకులు షేక్ చాన్ బాషాఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏడీ చాన్‌బాషా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఫిష్, ప్రాన్ నర్సరీలను పరిశీలించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ల్యాబ్ ఏడీ రాజ్‌కుమార్, కాలేజీ అధ్యాపకులు వి.సంధ్య, జ్ఞాన ప్రసూనాంబ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్లు

మండవల్లి: మండలంలోని సింగనపూడిలో 1వ వార్డు సభ్యుడి ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఈవోపీఆర్డీ బి.ఆనంద బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగనపూడి ఒకటో వార్డు సభ్యుడు ఒడుపు కృష్ణబాబు మృతి చెందిన కారణంగా ఉప ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ నెల 19న ఉప ఎన్నిక జరుగుతుందని, మంగళవారం నుంచి సింగనపూడి పంచాయతీ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఉప ఎన్నిక జరిగిన రోజే ఫలితాలు వెల్లడిస్తారు.

19న వణుదుర్రు సర్పంచ్ ఉప ఎన్నిక

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు పంచాయతీ సర్పంచ్ పదవికి ఉపఎన్నిక ఈ నెల 19న జరుగుతుందని ఎంపీడీవో పీ మల్లీశ్వరి సోమవారం చెప్పారు. మంగళవారం ఉదయం నుంచి 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఉపసంహరణకు 14న మధ్యాహ్నం 3గంటల వరకు అవకాశం ఉంటుంది. సర్పంచ్ పదవికి 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతను ప్రకటిస్తారని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ పొలంబడి

మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా కార్యాలయం నుంచి విచ్చేసిన హుస్సేన్ పాల్గొని సిబ్బంది రిజిస్టర్ నిర్వహణ వివరించారు. ఇన్‌చార్జిలు నారాయణ, వెంకటలక్ష్మి, శోభారాణి, నాగవిజయ, గౌతమ్‌కుమార్, సీసీఆర్పీలు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు పెంచాలి

మండవల్లి: ఆర్బీకేల్లో ఎరువుల విక్రయాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి అన్నారు. ముదినేపల్లి, మండవల్లి గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష సోమవారం నిర్వహించారు. పీఎం కిసాన్ యోజన పెండింగ్ ఉంటే ఈకేవైసీలు పూర్తి చేయాలని వీఏఏలకు సూచించారు. ఈ క్రాప్ ప్రక్రియ త్వరలో మొదలవుతుందని ఏడీఏ పేర్కొన్నారు. ఏవో ఎస్‌కే జరీనా, గౌస్ బాషా పాల్గొన్నారు.

సౌకర్యాలు సంపూర్ణం



గృహ సముదాయం



విద్యుత్ సబ్ స్టేషన్

- టిడ్కో గృహ సముదాయంలో సౌకర్యాలు పూర్తి
- రూ.70.74 కోట్లతో మౌలిక వసతులు
- టౌన్‌షిప్‌గా రూపుదిద్దుకున్న మల్లాయపాలెం లేఔట్
- గృహ ప్రవేశాలకు సిద్ధమవుతున్న లబ్ధిదారులు

గుడివాడ టౌన్: టిడ్కో గృహ సముదాయంలో సౌకర్యాల కల్పన ముగింపు దశకు చేరుకుంటోంది. పట్టణానికి దగ్గరలోని మల్లాయపాలెం లేఔట్‌లో గృహ సముదాయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన అనంతరం సౌకర్యాలు శరవేగంగా పూర్తయ్యాయి. దీంతో లబ్ధిదారులను వారికి కేటాయించిన ఫ్లాట్ల వద్దకు అధికారులు తీసుకెళుతున్నారు. ఫ్లాట్లలో ఏర్పాటు చేసి సౌకర్యాలను చూపిస్తున్నారు.

నీటి సరఫరా, విద్యుత్ వసతి, తలుపులు, కిటికీల పనితీరు, బాత్‌రూంలు, కిచెన్‌లలో వసతులు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే వారికి ఇంటి తాళాలు అప్పగిస్తున్నారు. దఫాలవారీగా లబ్ధిదారులకు తాళాలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించారు.

ఇప్పటికే 1200 మందికి..

ఇప్పటికే లబ్ధిదారులు రూ.450 చెల్లించి విద్యుత్ శాఖ నుంచి సొంత మీటరు ఏర్పాటుకు అనుమతులు పొందడంతో విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం మీటర్లు బిగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే 1200 పైబడి లబ్ధిదారులకు తాళాలు అందజేయడంతో గృహ ప్రవేశాలకు సిద్ధం అవుతున్నారు. ఆషాఢమాసం, వర్షాల కారణంగా ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా ఈనెలలో పెద్ద సంఖ్యలో గృహప్రవేశాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

పాఠశాల, పోలీస్ స్టేషన్..

తొలుత పచ్చదనం పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో షాపింగ్ మాల్ ఏర్పాటు, పాఠశాల, పోలీస్ స్టేషన్‌తో పాటు పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రవాణా వసతులు సైతం మెరుగుపర్చేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అన్ని వసతులతో కూడిన ఇళ్లతో పాటు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.70.74 కోట్లకు పైగా..

టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులకు మొత్తం రూ.70.74 కోట్లు ఖర్చు చేయగా సివిల్ పనులకు 43.17 కోట్లు, విద్యుత్ పనులకు రూ.11.81 కోట్లు, అప్రోచ్ బీటీ రోడ్‌కు రూ.11.10 కోట్లు, సీసీ రోడ్లకు రూ.32.74 కోట్లు, కల్వర్టులకు రూ.2.96 కోట్లు, స్ట్రీమ్ వాటర్ డ్రెయిన్‌లకు రూ.31 లక్షలు, గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్, సంప్ రూమ్‌లకు రూ.1.60 కోట్లు, ట్రంక్ మెయిన్స్‌కు రూ.97 లక్షలు, వాటర్ సప్లై మెయిన్స్‌కు రూ.96 లక్షలు, పీవైజే లైన్స్‌కు రూ.18 లక్షలు, అవుట్ ఫాల్ డ్రెయిన్లు, ఎస్టీపీ నిర్మాణాలకు రూ.14.95 కోట్లు హెచ్చించారు.

సౌకర్యాలు పూర్తయిన మొత్తం ఫ్లాట్స్	: 8912
300 చదరపు గజాల ఫ్లాట్స్	: 1584
365 చదరపు గజాల ఫ్లాట్స్	: 992
430 చదరపు గజాల ఫ్లాట్స్	: 6336

గృహప్రవేశాలకు సిద్ధం..



ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మా కల నెరవేరింది. సొంతింటి వారమయ్యామని ఆనందంగా ఉంది. అన్ని వసతులతో కూడిన ఇంటిని అందజేయడంతో పాటు పూర్తి హక్కులతో మాకు తాళాలు అందజేశారు. అధికారులు కల్పించిన వసతులు బాగున్నాయి. గృహప్రవేశాలకు మంచి రోజు చూస్తున్నాం. ఆనందంగా గృహప్రవేశానికి సిద్ధం అవుతున్నాం.

–ప్రత్తిపాటి ప్రమీల, లబ్ధిదారు

అద్దెభారం తగ్గుతుంది..



చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మాకు వేల రూపాయలు అద్దె చెల్లించడం భారంగా ఉండేది. ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి మా పేదవారి బాధలను గుర్తించి సొంతింటి వారిని చేశారు. వసతులు బాగున్నాయి. మా పిల్లలను చదివించుకునేందుకు పాఠశాల ఏర్పాటు చేస్తున్నామంటున్నారు. నిత్యావసర సరుకుల కొరకు షాపింగ్‌మాల్, ఇతర వసతులు సైతం ఇక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నందున మంచి జీవనం సాగిస్తామనుకొంటున్నాం.

–పెళ్ళూరి సరస్వతి, లబ్ధిదారు

బస్సు సౌకర్యం కల్పిస్తాం..



టిడ్కో గృహాల సముదాయం మరో టౌన్‌షిప్. గృహప్రవేశాలు ప్రారంభమైతే వేల సంఖ్యలో ప్రజలు అక్కడ నివాసం ఉంటారు. దీంతో ప్రజల కొరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. అధికారుల అనుమతి రాగానే రూట్ సిద్ధంచేసి బస్సులు ఏర్పాటు చేస్తాం. పట్టణంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలనేది ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆలోచన. ఇందుకు కావలసిన ప్రణాళికను రూపొందిస్తున్నాం. అవసరమైతే అక్కడ ఒక కౌంటర్ కూడా ఏర్పాటు చేస్తాం.

–జి.రాజేష్ కుమార్, ఆర్టీసీ గుడివాడ డిపో మేనేజర్

సంక్షేమ పాలనే ప్రభుత్వ లక్ష్యం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- రాపర్ల, జమీదగ్గుమిల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

జమీదగ్గుమిల్లి(పామర్రు): అన్ని వర్గాలకు సంక్షేమ పాలన అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం తగుచర్యలు చేపడుతోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని రాపర్ల, జమీదగ్గుమిల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. బుక్‌లెట్లను అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటిసత్వర పరిష్కారం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రామాదేవి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, కోఆప్షన్‌సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి గ్రామసర్పంచ్‌లు కె.చంద్రశేఖర్‌రావు, ఎం.పోలాక్ష, ఎం శ్రీలక్ష్మి, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, మద్దుల సుబ్రమణ్యం, కాకి ప్రవీణ్, రెడ్డిబాబు, కాకర్ల శ్రీనివాసరావు, కాకర్ల రవి, సజ్జా సుబ్రమణ్యం, ఎంపీడీవో వై రామకృష్ణ, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, గ్రామ వీఆర్వో పూర్ణ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణంలో పర్వతనేని విశేష కృషి

పర్వతనేనికి ఘన నివాళి



జగన్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం నిర్మాణంలో విశేష కృషిచేసిన వ్యక్తి పర్వతనేని జగన్మోహనరావు అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో సోమవారం జగన్మోహనరావు శత జయంతి వేడుకలు నిర్వహించారు. జగన్మోహనరావు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో జగన్మోహనరావుకు ఎన్టీరామారావు ఎమ్మెల్యే టికెట్ ఇస్తానంటే సున్నితంగా తిరస్కరించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు పాలేటి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, పాలకవర్గ సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, కె.రంగప్రసాద్, ఎన్. శేషగిరిరావు, చింతా రఘుబాబు, స్టేడియం కమిటీ శాశ్వత సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి విచారకరం..

ప్రజా గాయకుడు గద్దర్‌తో తనకు వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. 2009లో గన్నవరం నియోజకవర్గంలోని ఓ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవ కార్యక్రమానికి గద్దర్‌ను తాను, ఎమ్మెల్యే వంశీ స్వయంగా ఇంటికి వెళ్ళి ఆహ్వానించామన్నారు. అనంతరం గద్దర్‌ను తన కారులోనే గన్నవరం తీసుకువచ్చానని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఓదార్పు కలగాలని భగవంతుని కోరుకుంటున్నానన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు



గుడివాడలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి దళిత సంఘాలకు, అభ్యుదయ వాదులకు తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో దళిత సంఘాలు, అభ్యుదయ వాదులు, ఉద్యోగ సంఘాలు, సామాజిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. గద్దర్ అమర్ రహే, గద్దర్ ఆశయాలను అమలు చేస్తామంటూ నినాదాలు చేశారు. ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, బీఎస్పీ నాయకుడు దారం కరుణాకరరావు, మరియబాబు, ఆదిమాంధ్రసంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచర్ల సుధాకర్, మాల మహానాడు జిల్లా కార్యదర్శి పంతగాని సురేష్, గుమ్మడి విఠల్‌రావు, ఎం.రామకృష్ణ (ఆర్కే), దారం ఉపేంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, బి.రాజేష్, వెంపటి సైమన్, అత్తాటి సాల్మన్, జోషి, మహిళా కార్యకర్తలు ఎం.ఉమ, రమీజా, సునీత, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మత్తే శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు జి. శ్యాంబాబు, జిల్లా కన్వీనర్ జి.ఆంజనేయులు, అజయ్ బాబు, డి.కృష్ణారావు, బి.ఏడుకొండలు, సువర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచిన ప్రజాగాయకుడు గద్దర్ మరణం తీరని లోటని ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. స్థానిక దళిత సంఘాల నేతల ఆధ్వర్యంలో గద్దర్‌కు సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిమ్మగడ్డ భిక్షాలు, గౌస్ బేగ్, ఈడే శ్రీనివాసరావు, కోమల వరప్రసాద్, అబ్దుల్ రహీం, పుట్టి నరసింహారావు, ఈడే ఉమామహేశ్వరరావు, దళిత సంఘాల నేతలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

బీపీ మండల్‌కు బీసీ నేతల నివాళి



గుడివాడ టౌన్: జాతీయ స్థాయిలో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్ ప్రవేశపెట్టి ఆమోదింపచేసిన బిందేశ్వర ప్రసాద్ మండల్‌కు బీసీ సామాజిక వర్గాలు రుణపడి ఉంటాయని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం గుడివాడ నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు అన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని జ్యోతీరావ్ పూలే-సావిత్రీభాయ్ పూలే విగ్రహాల వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బిందేశ్వర ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు, జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ కృష్ణారావు, రూరల్ కన్వీనర్ బి సోమశేఖర్, నయనవరపు శేషుబాబు, టి.రాధ, ఎం.పద్మ, మూడెడ్ల ఉమ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘం అసిస్టెంట్‌పై ఫిర్యాదు

పమిడిముక్కల: కపిలేశ్వరపురం వీరమ్మతల్లి గ్రామైక్య సంఘం అసిస్టెంట్ ముసిబోయిన రజని సంఘాలకు సంబంధించిన రికార్డులు చూపించడం లేదని, అవకతవకలకు పాల్పడ్డారని ఆ సంఘం పరిధిలోని డ్వాక్రా గ్రూపు మహిళలు ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట నాగమునిమ్మ, కార్యదర్శి బి.బంగారమ్మ,మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.సుధారాణితో కలిసి డ్వాక్రా మహిళలు మాట్లాడారు. ఎల్‌ఐసీ కడితేనే లోన్ ఇప్పిస్తానని అంటున్నారని, లోన్‌కు డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు. ఏపీఎం కృష్ణంరాజును వివరణ కోరగా రజనిపై ఫిర్యాదులు వచ్చాయని, విచారణ జరుపుతున్నామని, ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. డ్వాక్రా గ్రూపు మహిళలు ఫిర్యాదు ఇచ్చారని, పూర్తిస్థాయిలో ఆడిట్ జరిపి రిపోర్ట్ ఇస్తే చట్టప్రకారం చర్య తీసుకొంటామని ఎస్ఐ సత్యనారాయణ తెలియజేశారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



పెదపారుపూడిలో టీహెచ్‌ఆర్ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ సురేష్ తదితరులు

తోట్లవల్లూరు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జే సుజాత తెలియజేశారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని యాకమూరు గ్రామ సచివాలయంలో తల్లులు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. తల్లిపాలలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని సుజాత చెప్పారు. ఎంపీటీసీ సభ్యురాలు బొమ్మారెడ్డి రోజారాణి, ఎంఎల్ హెచ్‌పీ పూర్ణ, ఏఎన్ఎం రోజాకుమారి, ఎంఎస్‌కే హిమబిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణలత, మరియమ్మ, కోకిల, తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ తెలిపారు. ముర్రుపాలు తాగడం వలన వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైస్ఎంపీపీ గంజాల సీతారామయ్య, ఏఎన్ఎం సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కపిలేశ్వరపురం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో సర్పంచ్ బుల్లా నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదమద్దాలి(పామర్రు): తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వీ భానుశ్రీ అన్నారు. పెదమద్దాలిలో తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపుగా ముర్రుపాలు పట్టించాలని అన్నారు. పాలు ఇవ్వడం వలన తల్లిబిడ్డల మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయన్నారు. సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, గ్రామ సర్పంచ్ బి.జెస్సీ శాంతకుమారి, బల్లిపర్రు సర్పంచ్ ఎన్. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ బి.ఉదయ్, ఉపాధ్యాయులు గ్రేసియా, పాతిమా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారి పెరుగుదలకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వైస్ఎంపీపీ పొనుగుమాటి రజిని, జాజుల ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి, ఎంఈవో బి.శ్రీనివాస్, పాములపాడు సర్పంచ్ ప్రత్తిపాటి హర్షవర్ధన్, సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి చేనేత పరిశ్రమ కీలకం

కైకలూరు: దేశ సామాజిక ఆర్థికాభివృద్ధిలో చేనేత పరిశ్రమ తోడ్పాటునందిస్తోందని వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి అన్నారు. కాలేజీలో చరిత్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.హరిప్రసాద్ ఆధ్వర్యంలో కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2015 ఆగస్టు 7 నుంచి ప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. చేనేత పరిశ్రమ ద్వారా 70 శాతం మంది మహిళలకు ఉపాధి లభిస్తోందన్నారు. అనంతరం ఈ ఏడాది నినాదం కలిగిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. చేనత రంగం అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు జాలబాబు, వి.సంధ్య, నున్న శ్రీనివాస్, వల్లూరి శ్రీనివాస్, ఉదయ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్వరమే పరిహారం ఇవ్వాలి

కలెక్టర్ రాజాబాబుకు మంత్రి నాగార్జున ఆదేశం



పామర్రు: మండల పరిధిలోని నిభానుపూడి గ్రామంలో అత్యాచార బాధితురాలి కుటుంబానికి సత్వరమే పరిహారం అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో మంత్రి నాగార్జునను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సోమవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్ఘటన వివరాలు కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ బాధితురాలి కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం అందాల్సిన పరిహారం విషయమై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం



మొవ్వ: చేనేత వస్త్రాలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని, చేనేత కార్మికులు సృజనాత్మక కళను తమ నైపుణ్యంతో వస్త్రాలపై తీర్చిదిద్దుతారని ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్.మాధవి పేర్కొన్నారు. సోమవారం జాతీయ చేనేత వస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు భారత చేనేత వస్త్రాలు, చేనేత మన సంస్కృతి అంశాలపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు అనిల్ వసుధ, నాగమల్లేశ్వరి ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

గుడివాడ టౌన్: ఈనెల 27, 28 తేదీల్లో గుడివాడ కమ్మ సత్రంలో గ్రామిక మహిళ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై వేధింపులు, అరాచకాలు నిరోధించేందుకు ఉన్న చట్టాలను అమలు చేయాలని కోరుతూ ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షురాలు డి.ధనలక్ష్మి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సభ్యురాలు ఎ.భవాని, అంగన్‌వాడీల సంఘం మాజీ అధ్యక్షురాలు జీఎస్ఎస్ కుమారి, ఐద్వా పట్టణ కార్యదర్శి పి. రజిని తదితరులు పాల్గొన్నారు.